# పెళ్ళిదొంగలు

ప్రతాప రవిశంకర్




**సుందరం** ఏదో అర్జంటు ఫైలును చూస్తున్నప్పుడు అటెండరు పోస్టులో వచ్చిన రెండు కవర్లను అతని టేబుల్‌మీద ఉంచి వెళ్ళిపోయాడు.

ఫైలు మూసి కవర్లను అందుకున్నాడు అతను.


ఒక కవరు బుక్‌పోస్టులో వచ్చిన పెళ్ళి శుభలేఖ. అందులో పెళ్ళికొడుకు శేఖరం. అతను సుందరానికి బాబాయి కొడుకే. ఆ శుభలేఖ వెనుక 'లెటర్ ఫాలోస్' అని రాసి ఉన్నది.

వెంటనే రెండో ఇన్లాండ్ కవర్ని తెరిచాడు సుందరం.

అందులో ఇలా ఉన్నది:

"ఒరేయ్, సుందరం! నా పెళ్ళి శుభలేఖ నీకు ఈ ఉత్తరంతోనే చేరిఉంటుంది. అందువల్ల నువ్వు సెలవు దొరకలేదని మానెయ్యకుండా పెళ్ళికి రెండు రోజులు ముందుగానే వచ్చెయ్యి. పెళ్ళిలో నీ అవసరం ఎంతయినా ఉంది. ఆ అవసరం ఏమిటో నీకు తెలుసు కదా! నువ్వు పెళ్ళి గూఢచారివి. నీకు అర్థమయి ఉంటుంది... ఉంటాను మరి...బై... శేఖరం."

పెళ్ళికొడుకే స్వయంగా ఆ ఉత్తరం రాసేసరికి సుందరానికి సంతోషం ఆగలేదు. వెంటనే ఆ కవర్లను టేబుల్ సొరుగులో ఉంచి బయటకు వచ్చాడు.




ఆఫీసు ముందున్న వేపచెట్టు కింద నిలబడి సిగరెట్టు వెలిగించాడు.

సుందరానికి ఈమధ్య డిమాండ్ బాగా పెరిగిపోయింది. అతని బంధువుల్లో ఎవరింట్లో పెళ్ళి జరుగుతున్నా అందరితోపాటు అతనికీ ఓ శుభలేఖ పంపుతూ ప్రత్యేకంగా రిక్వెస్ట్ చేస్తూ అతణ్ణి తప్పకుండా పెళ్ళికి రమ్మంటూ ఓ ఉత్తరం కూడా రాస్తున్నారు.

అయితే వాళ్ళంతా ఇలా ప్రత్యేకంగా ఉత్తరాలు రాయటానికి సరైన కారణమే ఉన్నది.

సాధారణంగా ప్రతి పెళ్ళిలోనూ వీలున్నంతవరకు చిన్న చిన్న దొంగతనాలు జరుగుతూనే ఉంటాయి. అలా దొంగతనం జరిగినప్పుడు దొంగల్ని పట్టుకోవడంలో సుందరం ఈమధ్య మంచి పేరు తెచ్చుకున్నాడు.

మొదటిసారి అతను ఓ దూరపు బంధువుల ఇంటికి పెళ్ళికి వెళ్ళాడు. ఆ రోజు మధ్యాహ్నం భోజనాలయిన తర్వాత సుందరం మధ్యగదిలో కూర్చుని ఎవరితోనో మాట్లాడుతున్నాడు. మాట్లాడుతూనే ఎదురుగా ఉన్న అద్దంలో సందులో అంట్లగిన్నెలు తోముతున్న ఆడమనిషి రెండు స్టీలు గరిటెలను చీర కుచ్చెళ్ళలో దాచుకుని ఇంటికి బయల్దేరడం గమనించాడు.

తర్వాత బయటకొచ్చి పెళ్ళి జనం ముందు ఆమె దాచుకున్న గరిటెలను బయటకు తీయించి ఆమెను దొంగగా పట్టిచ్చాడు.

అప్పుడే సుందరం పేరు అందరిలోనూ తెలిసిపోయింది. పైగా అతను డిటెక్టివ్ కథలు రాస్తాడనే విషయంకూడా సరిగ్గా అప్పుడే బయటపడిపోయింది.

ఆ తర్వాత నెలరోజులకే మరో బంధువుల ఇంట్లో మరో పెళ్ళికి వెళ్ళినప్పుడు ఆ ఇంట్లో వెండి కుంకుమ భరిణెను ఎవరో కాజేశారు. అప్పుడు కూడా సుందరమే రంగంలోకి దిగి పరిశోధించి చివరకు ఆ కుంకుమభరిణెను వంటమనిషి వెంకాయమ్మ కూరలు తరుగుతూ కాజేసిందని తేల్చేశాడు. ముందు కాదన్నా, సుందరం పోలీసులకు పట్టిస్తానని బెదరించిన తర్వాత వెంకాయమ్మ తన నేరాన్ని ఒప్పుకున్నది.

రెండో కేసుకూడా విజయవంతం కావడంతో సుందరం పేరు బంధువర్గంలో మోగిపోయింది. ఆ తర్వాత అలాంటి సంఘటనలు రెండు, మూడు జరిగినా సుందరం ఆ పెళ్ళి దొంగలను పట్టుకున్నాడు.

అప్పటినుంచీ అతని బంధువుల్లో ఎవరింట్లో పెళ్ళి జరుగుతున్నా సెక్యూరిటీ ఏర్పాట్లలో భాగంగా అతనికీ ప్రత్యేకంగా ఉత్తరాలు రావటం మొదలుపెట్టాయి.

సుందరం ఆ పెళ్ళికి వస్తున్నాడంటే పెళ్ళిదొంగలు జాగ్రత్తగా ఉంటారని, ఎటువంటి దొంగతనాలు ఆ పెళ్ళిలో జరగవని వాళ్ళ నమ్మకం.

మూడురోజులముందే సెలవు పెట్టి పెళ్ళికి వెళ్ళిపోయాడు సుందరం.

కల్యాణమండపంలో పెళ్ళి. పెళ్ళివాళ్ళంతా పక్క పక్క గదుల్లోనే దిగారు. పెళ్ళికొడుకు బాంకు ఆఫీసర్. పెళ్ళికూతురు కూడా ఉద్యోగం చేస్తోంది కాబట్టి పెళ్ళికి జనం బాగానే వచ్చారు.

కాఫీ, టిఫిన్ ఫుల్‌గా కొట్టి తన డ్యూటీలో ఉండిపోయాడు సుందరం.

అప్పటికే పెళ్ళికి సుందరం వచ్చాడని అందరికీ తెలిసిపోయింది. అతని కథలు ఆర్నెల్ల కోసారి పత్రికల్లో వస్తున్న కారణంగా కొంతమంది పనీ పాటా లేని అమ్మాయిలు అతని దగ్గర చేరి కథలు రాయడం గురించి అనేక చెత్త ప్రశ్నలతో అతణ్ణి వేధించడం మొదలుపెట్టారు.

వాళ్ళ ప్రశ్నలకు చిరునవ్వుతో జవాబులు ఇస్తూనే అందర్నీ వెయ్యి కళ్ళతో కనిపెడుతున్నాడు. ఒకేచోట కూర్చోకుండా అంతా తిరుగుతున్నాడు.

ఒకసారి అతను బయటకు వచ్చాడు. రోడ్డుమీద ఐస్‌క్రీమ్ బండి ఆగి ఉన్నది. కొంతమంది పిల్లలు ఐస్‌క్రీమ్ కొనుక్కుంటున్నారు.

ఆ పిల్లలందర్నీ చూశాడు సుందరం. అంతా అతనికి తెలిసిన వాళ్ళే. ఒక్కడే అతనికి తెలియని కుర్రాడు. వాడికి పన్నెండేళ్ళు ఉంటాయి. ఐస్‌క్రీమ్ తీసుకుని జేబులోనుంచి డబ్బులు బయటకు తీశాడు.

రెండు పది రూపాయల నోట్లు బయటకు వచ్చాయి. ఐస్‌క్రీమ్‌కు డబ్బులు ఇచ్చి లోపలకు వస్తున్నప్పుడు వాడిని పలకరించాడు సుందరం.

"నీ పేరేమిటి?"

"రాజు."

"ఎవరబ్బాయివి?"

చెప్పాడు. ఆయనెవరో సుందరానికి తెలీదు.

"పెళ్ళికి ఎవరెవరు వచ్చారు?"

"నేను, మా తమ్ముడు."

"ఆడ పెళ్ళి వాళ్ళ తరఫున వచ్చారా?"

తల వూపాడు వాడు.

ఆ తర్వాత ఐస్‌క్రీమ్ తిని వెళ్ళిపోయాడు.

పెళ్ళి ఉదయం పదీయాభైకి. అంతా హడావిడిగా ఉన్నది. కొంతమంది పెళ్ళికాని అమ్మాయిలు సుందరాన్ని ఆకర్షించటానికి అప్పుడప్పుడు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయినా సుందరం పెళ్ళి దొంగలను కనిపెట్టటమే ప్రస్తుతం తన ముఖ్యమైన డ్యూటీ అని సామాన్లను ఉంచిన గదులు చెక్ చేయడం మొదలుపెట్టాడు.

చెకింగ్ పూర్తయ్యేసరికి ముహూర్తం టైము దగ్గర పడింది. వెంటనే అతను కల్యాణ మంటపం దగ్గరకు వెళ్ళాడు.

ముహూర్తం అయిపోయింది. అతను సిగరెట్టు వెలిగించుకోటానికి బయటకు వచ్చాడు.

అక్కడ ఇంకో ఐస్‌క్రీమ్ బండి ఆగి ఉన్నది. రాజు ఐస్‌క్రీమ్ ఒకటి తీసుకుని

డబ్బులు ఇవ్వటానికి జేబులో చెయ్యి పెట్టి బయటకు తీశాడు. వాడి చేతికి రెండు వంద రూపాయల నోట్లు బయటకొచ్చాయి. వాడు కంగారుగా వాటిని లోపలకు నొక్కి షర్టు జేబులోనుంచి అయిదు రూపాయల నోటు తీసి వాడి కిచ్చాడు.

సుందరం తను ఏమీ చూడనట్టుగానే సిగరెట్టు కాల్చుకుంటున్నాడు.

వాడు ఇంకో ఐస్‌క్రీమ్ కూడా తిని సుందరం ముందునించే లోపలకు వెళ్ళిపోయాడు. వాడి వెనుకే లోపలకు వెళ్ళాడు సుందరం.

చదివింపులు మొదలయినాయి.

ఇంతలోనే ఓ గదిలోనుంచి అరుపులు మొదలయినాయి.

పెళ్ళికూతురు మేనత్త సూట్‌కేసు సొరుగులో ఉండాల్సిన రెండొందల రూపాయలు పోయాయట.

ఆమె పెద్దగా కంగారుగా అరుస్తోంది.

అప్పటికే పెళ్ళిజనం చాలామంది ఆమె చుట్టూ చేరారు. రకరకాల ప్రశ్నలతో ఆమెను వేధించడం మొదలుపెట్టారు. సుందరానికి అంతా అర్థమయిపోయింది.

"దయచేసి ఎవ్వరూ కంగారుపడకండి. రెండొందలు కాజేసిన దొంగ ఇక్కడే ఉన్నాడు" అని ఒకచోట నిల్చుని దిక్కులు చూస్తున్న ఆ కుర్రాడిని చెవి పట్టుకుని వాళ్ళ దగ్గరకు తీసుకు వచ్చాడు. తర్వాత వాడి జేబులోనుంచి రెండొందల రూపాయలనూ బయటకు తీశాడు.

అంతా ఆశ్చర్యపోయారు.

"ఆ కుర్రాడే ఈ దొంగతనం చేశాడని ఎలా గ్రహించారు?" అని అడిగారు కొంతమంది అమ్మాయిలు సుందరాన్ని.

అతను జేమ్స్ బాండ్‌లా నవ్వి, చిన్న పోజు ఇచ్చి తను వాడిని గమనించడం, వాడి జేబులో డబ్బులు బయటకు రావడం అంతా వివరంగా చెప్పాడు.

వాళ్ళంతా అతణ్ణి మెచ్చుకున్నారు.

పెళ్ళికొడుకు, మరికొంతమంది అతణ్ణి ప్రత్యేకంగా అభినందించారు.

ఇంతకీ ఆ కుర్రాడు పెళ్ళికూతురు ఇంటి వాళ్ళ అబ్బాయట.

డబ్బు పోగొట్టుకున్నామె సుందరం ఫోటో ఉంటే ఒకటి ఇవ్వమని అడిగింది కృతజ్ఞతగా. ఇంటికి వెళ్ళిన తర్వాత పంపిస్తానని ప్రామిస్ చేశాడు అతను.

చాలామంది అమ్మాయిలు అతడి గురించి గుసగుసలాడుకోవడం గమనించి అతను చిన్నగా నవ్వుకున్నాడు.

భోజనాలయినాయి.


కొంతమంది యువకులు ఓ గదిలో పేకాట మొదలుపెట్టారు. వాళ్ళ బలవంతంమీద సుందరం కూడా వాళ్ళలో కూర్చుని పేకాట మొదలు పెట్టాడు. సాయంత్రమయ్యేసరికి అతని జేబులో ఉన్న డబ్బులన్నీ పోయాయి. తర్వాత అతను డబ్బులకోసం సామాన్లని ఉంచిన గదిలోకి వచ్చాడు. ఆ గదిలో ఉన్న అతని సూట్‌కేసులో రెండొందల యాభై రూపాయలు ఉన్నాయి.

సుందరం ఉలిక్కిపడ్డాడు. ఆ గదిలో అతను పెట్టిన చోట సూట్‌కేసు కనిపించలేదు. కంగారుగా అతను ఆ గదినంతటినీ వెతికాడు. కాని ఎక్కడా అతని ఎర్ర సూట్‌కేసు కనిపించలేదు. ఆ తర్వాత అన్ని గదులూ వెతికాడు. ఎంత వెతికినా సుందరం సూట్‌కేసు కనపడలేదు. దాన్ని ఏ పెళ్ళి దొంగలో ఎత్తుకుపోయారు.

సూట్‌కేసు - అందులో ఉన్న బట్టలు, రెండొందల యాభై రూపాయలు ఖాళీ.

అయితే సుందరం తన సూట్‌కేసు పోయిన వార్తను ఎవ్వరికీ చెప్పదల్చుకోలేదు. ఎందుకంటే, పెళ్ళి గూఢచారిగా తను సంపాదించుకున్న పేరు తను పోగొట్టుకున్న వస్తువుల కంటే ఎక్కువని అతని నమ్మకం. ★

జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా



బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.




ఉచితం!
"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్"
అన్న మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి.
జాడీ మూత లోపలి కార్క్‌తోపాటు 70 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.
హెచ్.ఎమ్.ఎమ్. లిమిటెడ్. డిపార్ట్‌మెంట్
APW. 1 బై సింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001
OBM/5829 Tel